www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 18 డిసెంబర్ 2025
5
వైఎస్ఆర్





అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

జిజిహెచ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప జిజిహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు డిక్లరేషన్ ఇస్తేనే వేతనాలు ఇస్తాం, లేకుంటే ఇవ్వమని ఇబ్బందులకు గురిచేస్తున్న పద్మావతి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సర్వీస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐడియూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్ ఏర్పడినప్పటి నుంచి శానిటేషన్ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. మూడు, నాలుగు సంవత్సరాలకు మారే కాంట్రాక్టర్ వర్కర్ల మీద పెత్తనం చేయడం దుర్మార్గమని చెప్పారు. ఇలాంటి కాంట్రాక్టర్‌పై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాయలసీమ వ్యాప్తంగా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం బెదిరింపులకు దిగడం సమంజసం కాదని హెచ్చరించారు. వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని పేర్కొన్నారు. రూ.18,600 గాను రూ.13,960 వేతనం ఇస్తున్నారని తెలిపారు. మాట్లాడితే సిఎం నా క్లాస్‌మెంట్ అని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సిఎం క్లాస్‌మెంట్ అయినా యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రతి సమావేశంలో కార్మికులకు న్యాయం చేయాలని పిలుపునిస్తున్నారని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో సిఎం చెప్పిన విధంగా కాంట్రాక్టర్ చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. వాటికి భిన్నంగా చేయడానికి కాంట్రాక్టర్‌కు ఏ మాత్రం హక్కు లేదని తెలిపారు. కార్మికులను ఇబ్బందులు పెడుతున్న పద్మావతి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ సర్వీసు యాజమాన్యంపైన కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం జెసి అదితి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు రవి, ఆప్కాస్ జిల్లా అధ్యక్షులు పవన్, రిమ్స్ శానిటేషన్ కార్మికులు విజయ, అన్నమ్మ, పెంచలమ్మ, రాజమ్మ, ఉదయ్, ఆప్కాస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.రమణారెడ్డి, సెక్యూరిటీ యూనియన్ అధ్యక్షులు ఎల్.పి.వెంకటసుబ్బయ్య, నాయకులు హరికృష్ణ, చీరాల హరి, శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

'ఉపాధి' చట్టం పేరు మార్పు దుర్మార్గం

- ధర్నాలో వ్య.కా.స జిల్లా కార్యదర్శి అన్వేష్

ప్రజాశక్తి-కడప అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసే తలంపుతో మెదలెంగా ఉపాధి చేస్తూ పేరు మార్చడం అత్యంత దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్ అన్నారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎందుకు రద్దు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికి సగటున 50 రోజులకు మించి ఉపాధి పనులు కల్పించలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాలలో వలసలు నివారించలేక పోతున్నారని తెలిపారు. గ్రామాలలో వలసలు నివారించేందుకు ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలని డిమాండ్ చేశారు. నేటి ధరలకు అనుగుణంగా రూ.600 కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర లో ఎన్డీఏ ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న ఆజీవిక మిషన్ (గ్రామీణ) బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టడం మహాత్మ గాంధీ పేరును తొలగించడం చాలా దుర్మార్గమన్నారు. గాడ్సే వారసులుగా నిరూపించుకున్నారని విమర్శించారు. పథకంలో కేంద్రం ప్రభుత్వం వాటా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతం చేయడం చాలా అన్యాయమన్నారు. మామూలు స్కీమ్ లాగా దీన్ని తయారు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు కేంద్రం ప్రభుత్వం వాటా 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా పది శాతం మాత్రమే ఉండని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వలసలు నివారించడానికి కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఈ కొత్త పథకం ద్వారా తెలుస్తుందన్నారు. ఈ కొత్త బిల్లులో 125 రోజులు పని పెంచుతున్నట్లు చెప్పి 60 రోజులు పని నిషేధం విధించారని, వ్యవసాయ సీజన్‌లో రైతులకు కూలీల కొరత లేకుండా అని రైతుల ముసుగు తగిలించారని విమర్శించారు. పనులను నాలుగు రకాలుగా విభజించి రూ.కోట్ల పనులను యంత్రాలు కాంట్రాక్టర్లకు కోసమే తీసుకొస్తున్నారన్నారు. ఉపాధి నిధులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ తరగతులకు ప్రభుత్వం ఇచ్చిన భూముల అభివృద్ధి, కాలనీల అభివృద్ధి, పక్కా గృహాల బేస్ మట్టాలకు ప్రత్యేకంగా ఉపాధి హామీలో నిధులు మంజూరు చేస్తూ పనులు చేపట్టడం ఇప్పటి వరకు కొనసాగించిందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి వాటికి నిధులు లేకుండా చేస్తున్నారన్నారు. పాత పద్ధతిలోనే మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కె.నర్సయ్య, దాసరి వెంకటేష్, సహాయ కార్యదర్శి గురువయ్య, జిల్లా కమిటీ సభ్యులు సుదర్శన్, వీరభద్రుడు, అయ్యవారు, అబ్రహం, డేవిడ్, కెవి పిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘు, బండి జకరయ్య, నరసింహులు, పిఎన్ఎం నాయకులు రమణ, యువజన సంఘం నాయకులు విజయ్, ఉదయ్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వ్య.కా.స నాయకులు

ఇంధన పొదుపు ప్రతి పౌరుడి బాధ్యత

- జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ



ర్యాలీలో పాల్గొన్న జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ, అధికారులు

ప్రజాశక్తి - కడప

ఇంధన పొదుపు ప్రతి పౌరుడి బాధ్యతని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల భాగంగా, విద్యుత్ వినియోగంలో మితవ్యయం, శక్తి సంరక్షణ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం ఎపిఎస్‌పిడిసిఎల్ కడప డివిజనల్ ఎలక్ట్రికల్ ఆఫీస్ నుండి అప్సరా సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ మాట్లాడుతూ ర్యాలీ సందర్భంగా విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు, ఇంధన పొదుపు ద్వారా పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాలకు శక్తి వనరుల భద్రత వంటి అంశాలను ప్రజలకు తెలియజేశారు. ఇంధన పొదుపు ప్రతి పౌరుడి బాధ్యతని, చిన్నచిన్న చర్యల ద్వారా పెద్ద మార్పు సాధ్యమవుతుందన్నారు. విద్యుత్ వినియోగంలో మితవ్యయం పాటించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడవచ్చని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు నినాదాలు చేస్తూ ప్రజల్లో ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్య నాయక్, విద్యుత్ శాఖ ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ప్రకృతి సేద్యంపై అవగాహన అవసరం

- వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్



మాట్లాడుతున్న జెడిఎ చంద్రానాయక్

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ అన్నారు. బుధవారం ఆచార్య ఎన్.జి.రంగా అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం గ్రామ విద్యార్థులు నిర్వహించిన రైతు సదస్సు వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రనాయక్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలోనే వ్యవసాయం అనుబంధ శాఖల గురించి తెలుసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ. ప్రకృతి వ్యవసాయం చేయాలని చెప్పారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులనూ వాడాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ అంకయ్య కుమార్, ఏరువాక కేంద్రం సమన్వయకర్త సమన్వయకర్త డాక్టర్ కృష్ణప్రియ, వ్యవసాయ పరిశోధన స్థానం డాక్టర్ సునీల్ రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి పంటల సాగు తెగుళ్ల పురుగుల మందుల వాడకం గురించి వివరంగా తెలియజేశారు. వ్యవసాయ కళాశాల తిరుపతి, మహానంది, ఉదయగిరి అసోసియేట్ డిన్ మాట్లాడుతూ విద్యార్థులు రైతులను కలిసి వారి అనుభవాలను తెలుసుకొని మంచి దిగుబడులు ఎలా సాధించాలో నేర్చుకోవాలని సూచించారు. సూక్ష్మ సేద్యం డ్రోంట్ స్ప్రేయింగ్ గురించి అధునాతన వ్యవసాయ పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు తమ విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి పిఎసిఎస్ చైర్మన్ గంధం మోహన్ బాబు పాల్గొన్నారు.

శివకృష్ణారెడ్డికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-కడప అర్బన్ : డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి చెందిన యానిమేషన్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఉండేల శివకృష్ణారెడ్డి చెన్నైలోని హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (డీమ్డ్ టు బీ యూనివర్సిటీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. హిందుస్థాన్ యూనివర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యదుర్గ, కెఎస్ఆర్ఎం కాలేజ్ సిఎస్ఇ విభాగం ప్రొఫెసర్ వి.లోకేశ్వర్‌రెడ్డి మార్గదర్శకత్వంలో హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ ద్వారా యానిమేటెడ్ వీడియోల క్వాలిటీ ఆఫ్ సర్వీస్ మెట్రిక్స్ అభివృద్ధి అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. యానిమేషన్ విభాగాధిపతి దినేష్ కుమార్, అధ్యాపకులు శివకృష్ణారెడ్డిని అభినందించారు.

20న కడపలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-కడప అర్బన్: కడప నియోజకవర్గ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో, నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా మెప్మా ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన కడప నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మాధవి తెలిపారు. బుధవారం జాబ్ మేళా పోస్టర్లను ద్వారకానగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్, అన్ని గ్రాడ్యుయేట్లు, పీజీలు, ఫార్మా, నర్సింగ్ చదివిన యువత పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఇన్స్టడయల్, రిలయన్స్, టాటా, అపోలో, యాక్సిస్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్ ప్రముఖ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు అందించనున్నట్లు తెలిపారు. 2,500 మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఇంకా ఎక్కువ సంఖ్యలో ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా వరుసగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని, అదే క్రమంలో ఈ మెగా జాబ్ మేళా కీలకమని తెలిపారు.

మౌలిక వసతులు మెరుగుపరచాలి : మేయర్

ప్రజాశక్తి-కడప అర్బన్ : నగర ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో నగర మేయర్ పాక సురేష్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి మార్నింగ్ విజిట్ కార్యక్రమం చేపట్టారు. పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న వాటర్ పంప్ హౌస్‌లను పరిశీలించారు. నగరానికి సరఫరా అవుతున్న తాగునీటి పరిస్థితి, పంప్ హౌస్‌ల పనితీరు, తాగునీటి పంపిణీలో ఉన్న సమస్యలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వాటర్ పంప్ హౌస్ పరిశీలన అనంతరం మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు షఫీ, బాలస్వామి రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జులు శ్రీరంజన్ రెడ్డి, సుబ్బరాయుడు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టని ప్రభుత్వం : వైసిపి

ప్రజాశక్తి - కడప: రబీ సీజన్ ప్రారంభమైనా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం యాప్ ఇంతవరకు ఓపెన్ కాకపోవడం చాలా దారుణమని వైసిపి రాష్ట్ర నాయకులు సంభటూరు ప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల మీద ఎందుకు ఇంత నిర్లక్ష్యమన్నారు. గత వైసిపి పాలనలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేదన్నారు.

కెఎల్ఎం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కడప అర్బన్: ఎన్‌పిటిఇఎల్ పరీక్ష ఫలితాల్లో కేఎల్ఎం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ తెలిపారు. సిఎస్ఇ మూడవ సంవత్సరం చదువుతున్న కె.మేరీ అనూష 81 శాతం, ఎం.మమత. 81, ఎస్.సాజిద. 85, ఎస్.ముస్కాన్ ఆలియా 83, ఆర్.ప్రత్యూష 83 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ రాజేశ్వరి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ, అన్ని శాఖల విభాధిపతులు అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపల్ రత్నమ్మ

ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్: ఇటీవల బదిలీ పొంది రిలీవ్ కానీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు కోరారు. బుధవారం ఆర్‌జెడి కార్యాలయంలో ఆర్‌జెడి శామ్యూల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2025 మే, జూన్‌లో జరిగిన ఉపాధ్యాయ బదిలీల అనంతరం అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడి బదిలీ పొందిన ఉపాధ్యాయులు రిలీవ్ కాకుండా పాత పాఠశాలల్లోనే కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతతో 10వ తరగతి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదని తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న వేళ ఉపాధ్యాయుల కొరత తీర్చడానికి ప్రభుత్వం అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించుటకు నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ఎందుకు ఆలస్యమవుతున్నదో తెలపాలన్నారు. ప్రభుత్వం విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను వెంటనే నియమించి బోధనకు ఆటంకం లేకుండా చూడాలని, అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు చేరిన వెంటనే ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రెజరర్ నరసింహారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట: ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలను కడప జిల్లాలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో నర్వకాటిపల్లి, గంగపేరూరు పంచాయతీలకు చెందిన వరికుంట్ల యానాదయ్య, ఎ.వీరయ్య, బి.నాగరాజు, నరసింహులు, మామిడి మురళి, చరణ్, సురేష్, కొండయ్య ఉద్యమానికి తమ మద్దతు తెలిపుతూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా తీసుకునే పరిపాలనా నిర్ణయాలను సహించబోమని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు రామదాసు, బొబ్బిలి, పాటూరు గంగిరెడ్డి, రోశయ్య, సుబ్బరాయుడు, పొట్టేటి రాజారెడ్డి, ఎమ్మెస్ వెంకట్‌రెడ్డి, ఎం.వెంకటరెడ్డి, కత్తి చంద్ర, అజ్మతుల్లా సుబ్బరామయ్య, వెంకటేశు పాల్గొన్నారు.

'నాగార్జున'లో ఘనంగా క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని మారుతినగర్‌లోని నాగార్జున మోడల్ స్కూల్లో బుధవారం క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్పోర్ట్స్ స్పెక్ట్రా పేరుతో నిర్వహించిన ఈ వేడుకలను విద్యా సంస్థల చైర్మన్ ఎం.శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి ప్రారంభించారు. క్రీడా, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఒలంపిక్ తరహాలో క్రీడా జ్యోతిని రిలే పద్ధతిలో జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొన్న సాయి నిహారిక, ఆఫ్తాబ్, సాయి చరితేష్‌రెడ్డి, శ్రీవేఘాశాన్వి, నింకుజిత, శ్రీశరణ్య, అసద్ అలీఖాన్, సాయి రాకేస్, కార్తీక్ ద్వారా చైర్మన్‌కు అందజేశారు. క్రీడా జ్యోతి ప్రజ్వలనతో క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. స్పోర్ట్స్ డే ప్రారంభ సూచికగా చైర్మన్, డైరెక్టర్ పావురాలను గాలిలోకి ఎగురవేశారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో మానసిక వికాసంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు వస్తాయని పేర్కొన్నారు. క్రీడలపై ఆసక్తి పెంచడానికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపల్ సాయి కృష్ణ పాల్గొన్నారు. విజేతలకు విక్టరీ స్టాండ్‌పై సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు.



మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేస్తున్న చైర్మన్, డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, శ్రీదేవి

ఆంధ్ర జట్టు ఘన విజయం

ప్రజాశక్తి - కడప: ఎసిఎ స్టేడియంలో ఆంధ్ర-ఉత్తరాఖండ్ జట్ల మధ్య నాలుగు రోజుల పాటు జరగాల్సిన అండర్-19 స్టేట్ మ్యాచ్ రెండు రోజులకే ముగిసింది. ఉత్తరాఖండ్ జట్టుపై 10 వికెట్ల తేడాతో ఆంధ్ర జట్టు ఘన విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ జట్టు 202 పరుగులు చేసింది. వికెట్ నష్టపోకుండా 42 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 71.2 ఓవర్లలో 254 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఆనంద్ జోసాయి 49, మన్విత్ కుమార్‌రెడ్డి 39 పరుగులు చేశారు. ఉత్తరాఖండ్ జట్టులోని నిష పటేల్ 5 వికెట్లు, లక్ష రైచందాని 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఉత్తరాఖండ్ జట్టు 36.0 ఓవర్లలో 102 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని లక్ష (నాటౌట్), ఆయుష్ దేశ్వాల్ 25 పరుగులు చేశారు. ఆంధ్ర జట్టులోని ఎఎన్‌వి లోహిత్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ ఎన్.రాజేష్ 4 వికెట్లు తీసుకున్నాడు. 55 పరుగుల విజయ లక్ష్యాన్ని ఉత్తరాఖండ్ జట్టు ఆంధ్ర జట్టు ముందు ఉంచింది. 55 పరుగుల విజయ లక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 10.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 55 పరుగులు చేసి 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. విజయం సాధించిన ఆంధ్ర జట్టుకు ఏడు పాయింట్లు లభించాయి.

నాయకుల లబ్ధి కోసమే పిపిపి విధానం

ప్రజాశక్తి - కడప: అధికార పార్టీ నాయకులకు లబ్ది చేకూర్చేందుకే చంద్రబాబు పిపిపి విధానంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటుపరం చేసే చర్యలు చేపట్టారని వైసిపి వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా రాష్ట్రానికి అనుభవజ్ఞులైన సంపద సృష్టించే నాయకుడు అవసరమని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండేళ్లలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణాలు చేపట్టి దాదాపు పూర్తి చేయగా, చంద్రబాబు ప్రభుత్వం 18 నెలల పాలనలో వాటిని పూర్తి చేయకపోగా పిపిపి విధానంలో తన పార్టీలోని నేతలకు కట్టబెట్టే చర్యలకు తెర తీసిందన్నారు. కళాశాలలను ప్రారంభించిన తర్వాత ఒక్కొక్కటిగా అవసరమైన సదుపాయాలు కల్పించుకోవచ్చన్నారు. పేదలు వైద్య విద్యకు దూరమవుతారన్నారు.



మాట్లాడుతున్న కళ్యాణ్ చక్రవర్తి

ఉద్యోగులను విస్మరిస్తున్న ప్రభుత్వం : యుటిఎఫ్

ప్రజాశక్తి - బద్వేలు: ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను పూర్తిగా విస్మరిస్తోందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ విమర్శించారు. బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బద్వేలు, గోపవరం మండలాల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాక మునుపు కూటమి పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చారని తెలిపారు. ఆ హామీలు నిజమని నమ్మి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరిస్తే, ఉద్యోగుల సహకారంతో అధికారం చేపట్టిన ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.శివప్రసాద్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని, యుటిఎఫ్ బద్వేల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవానందం, కె.సుధాకర్, గోపవరం మండల అధ్యక్షులు పి.తిరుపాల్ రెడ్డి, ట్రెజరర్ ఎం.రామచంద్రయ్య సీనియర్ నాయకులు వీరదాసరి క్రిస్టఫర్, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.కంచిరెడ్డి, ఎస్.మస్తాన్ వలి, ఎ.లాజరస్, సుబ్బరాజా, ఓబన్న, ఎస్.పవన్ కుమార్ పాల్గొన్నారు.

మేయర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-కడప అర్బన్



మేయర్‌ను సన్మానిస్తున్న ఎన్ఆర్ఐ దంపతులు

జిల్లా పద్మశాలి సంఘ నాయకులు రెయిన్‌బో సుబ్బరాయుడు, రామచంద్రరావు, రిటైర్డ్ టీచర్ బడిచెర్ల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ విద్యాధర్ దంపతులు కడప నగర మేయర్‌గా ఎన్నికైన పాక సురేష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు నాగయ్య, 48వ డివిజన్ నాయకులు ఓబుల్‌రెడ్డి, నాగిరెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ మహిళలు, యువకులు, మేయర్‌ను సన్మానించారు. డివిజన్‌లో వీధి లైట్లు కొన్ని చోట్ల లేవని, వాటి ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. మేయర్ సంబంధిత అధికారులతో మాట్లాడి లైట్లను మంజూరు చేయాలని ఆదేశించారు. వైసిపి నగర బిసి నాయకుడు గునిశెట్టి సాయి ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం నాయకులు మేయర్ సన్మానించారు. నగర పాలక సంస్థ అధికారులు ఇ1 శివ, కమిషనర్ సిసి శివ, ఇ2 అరుణ్, సి1 హర్ష మేయర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ సర్పంచ్ రాజేశ్వరిరెడ్డి, కృష్ణ పలువురు నాయకులు సన్మానించారు.

సైన్స్ ఫెయిర్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌కు విశేష స్పందన లభించింది. మండలంలోని అన్ని హైస్కూల్స్ విద్యారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఎంఇఒలు సుబ్బరాయుడు, రమాదేవి ప్రారంభించారు. మండలం నుంచి దాదాపు 33 ప్రదర్శనలను ప్రదర్శించారు. ఇందులో అత్యుత్తతమ ప్రదర్శనలను ఎంపిక చేశారు. గ్రూప్ ఎగ్జిబిట్‌లో ఏడు థీమ్స్ కొరకు ఏడు పాఠశాలల నుంచి ఎన్నుకున్నారు. వ్యక్తిగత విభాగంలో ఎన్విరాన్మెంటల్ సైన్స్‌లో అంగడివీధి జడ్‌పి హైస్కూల్ (తెలుగు) 9వ తరగతి విద్యార్థి కె.గిరీష్, టీచర్ విభాగంలో కంప్యూటర్ సైన్స్ ఎఐ టీచర్ శ్రీదేవి, బయనపల్లె ఎస్‌విఎస్‌హెచ్ స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్ర ఉపాధ్యాయుని ఎంపికయ్యారు. వీరందరూ ఈ నెల 20వ తేదీన కమలాపురంలో జరిగే డివిజనల్ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొంటారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె జడ్‌పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు శోభారాణి పాల్గొన్నారు. **వల్లూరు:** వల్లూరు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ ఉత్సాహంగా జరిగింది. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత పెంపొందించేందుకు నిర్వహించారు. పర్యావరణం, ఆరోగ్యం, వ్యవసాయం, సాంకేతికత వంటి అంశాలపై విద్యార్థులు రూపొందించిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇలాంటివి పరిశోధనాత్మక ఆలోచనలు పెంచుతాయని ప్రధాన ఉపాధ్యాయుడు డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులను గౌరవించాలి

ప్రజాశక్తి - బద్వేలు

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు పూజ్యనీయులని ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బద్వేలు శాఖ అధ్యక్షులు శీలం గంగన్న అన్నారు. బుధవారం అసోసియేషన్ కార్యాలయంలో పెన్షనర్స్ డే సందర్భంగా డిఎస్ నకరా చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి ఆయన పెన్షనర్స్‌కు చేసిన సేవలకు ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులను ప్రజలు గౌరవించాలని, ప్రజల కోసం వారి జీవితకాలము పనిచేసి వారి సమస్యల కోసం పోరాడిన విశ్రాంత ఉద్యోగులను అటు ప్రభుత్వం ఇటు ప్రజలు గౌరవించాలన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని, పెన్షనర్స్ సమస్యల కోసం పోరాటం చేసిన డిఎస్ నకరాను ప్రతి విశ్రాంత ఉద్యోగి గౌరవించి తీరాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం పరిష్కరించాలని, ప్రభుత్వం అధికారంలోనికి రావాలన్నా, విశ్రాంత ఉద్యోగుల మద్దతు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జి.వెంకట లక్ష్మణ్, జనరల్ సెక్రెటరీ ఎమ్మెస్ సత్తిబాబు, ట్రెజరర్ జె.గురుమూర్తి, కార్యదర్శి ఎ.కుమారి, కార్యదర్శి జాన్ పాల్గొన్నారు.


ఎంఇఒకు వైజ్ఞానిక ప్రదర్శనను వివరిస్తున్న విద్యార్థులు

వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులకు మేలు చేస్తాయి

ప్రజాశక్తి - చాపాడు

విద్యార్థుల అభ్యున్నతికి వైజ్ఞానిక ప్రదర్శనలు తోడ్పడతాయని ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. మండల కేంద్రంలోని అల్లాడుపల్లె హైస్కూల్లో బుధవారం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతను పెంపొందించడానికి విద్య, వైజ్ఞానిక సదస్సులు ఎంతో దోహద పడతాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఇలాంటి ప్రదర్శనల్లో భాగ స్వాములు కావాలన్నారు. మండల పరిధిలోని అన్ని హైస్కూల్స్, కస్తూర్బా పాఠ శాలల నుండి 8, 9 విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. వ్యవసాయ సంబంధమైన, గ్రీన్ ఎనర్జీ, మ్యాథమెటికల్ మోడలింగ్, హెల్త్ అండ్ హైజీన్ వంటి ప్రదర్శనలను ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపుగా భూపేష్‌కు టిడిపి జిల్లా అధ్యక్ష పదవి

ప్రజాశక్తి - ముద్దనూరు

జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పార్టీకి, ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపుగా కడప జిల్లా టిడిపి అధ్యక్షులుగా ఎంపికవ్వడం హర్షణీయమని ఆ పార్టీ మండల అధ్యక్షులు చింతా శివరామిరెడ్డి తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ కూడలిలో శివరామిరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు, నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. భూపేష్‌రెడ్డిని జిల్లా అధ్యక్షులుగా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాయపాటి మాబు, చంద్ర శేఖర్ నాయుడు, చంద్ర ఓబులరెడ్డి, కేశవరెడ్డి, జగదీష్ కుమార్ రెడ్డి, రామ కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి : సిఐ

ప్రజాశక్తి - ముద్దనూరు

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సిఐ ఎస్.నగేష్‌బాబు పేర్కొన్నారు. ముద్దనూరు యుజి పోలీస్‌స్టేషన్ సిఐగా ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం అర్బన్ రేంజ్ విఆర్ నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజలు, మహిళలు, బాలికల శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకదృష్టి సారిస్తామన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. గొడవలు సృష్టించి, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు, నాయకులు సహకరించాలన్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిఐ దస్తగిరి కడప విఆర్‌కు వెళ్లారు.


సిఐగా బాధ్యతలు చేపట్టిన నగేష్‌బాబు

టూ టౌన్ సిఐగా వంశీనాథ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



ప్రొద్దుటూరు టూ టౌన్ సిఐగా వంశీనాథ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. దేవనకొండ నుంచి ఆయన బదిలీ అయ్యారు. ఇక్కడున్న సిఐ సదాశివయ్య కడప-2 టౌన్‌కు బదిలీ అయ్యారు.


మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపిడిఒ హరినాథ్

కుటుంబ ఆర్థిక, సామాజిక పరిస్థితులపై సర్వే

ప్రజాశక్తి - చాపాడు

ప్రజల కుటుంబ, ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగానికి సంబంధించిన సమాచారంపై సర్వే నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపిడిఒ హరినాథ్ తెలిపారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఇకెవైసి ద్వారా సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ రామానుజం, జిఎస్ డబ్ల్యుఎస్ అధికారి రత్నరాజు, మాస్టర్ ట్రైనర్ మనోజ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూనిఫైడ్ సర్వేకు ప్రజలు సహకరించాలి

ఎర్రగుంట్ల : యూనిఫైడ్ సర్వేకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శేషపతి పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో కమిషనర్ మాట్లాడుతూ నెల రోజులపాటు ఈ సర్వే కొనసాగుతుందన్నారు. సంబంధిత సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబంలోని ప్రతి వ్యక్తి సమాచారాన్ని సేకరించి, ఇకెవైసి చేయనున్నట్లు తెలిపారు. కమిషనర్ తన కార్యాలయంలో సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రశ్నల జాబితాను ఎలా పూరించాలి, వెరిఫికేషన్ విధానం, డేటా సేకరణపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు సత్ప్రవర్తన, క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రతి విద్యార్థి సత్ప్రవర్తన, క్రమశిక్షణతో మెలగాలని పశుసంవర్థక ఎడి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక బిసి బాలికల వసతిగృహంలో బుధవారం నేటి తరం యువతలో స్ఫూర్తి నింపడానికి గంగ రూరల్ ఎన్విరాన్మెంట్ సంస్థ అధ్యక్షుడు శివకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని కోరారు. చెడు అలవాట్లకులోనైతే భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు. సైబర్ నేరాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ పాఠశాల కరస్పాండెంట్ కేశవులు, వార్డెన్ సుజాత, అలిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ నాగసుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పశువర్ధక శాఖ ఎడి రవీంద్రనాథ్‌రెడ్డి

వరిగడ్డికి పెరిగిన డిమాండ్


వరిగడ్డి కట్టలు కడుతున్న మిషన్

ప్రజాశక్తి - చాపాడు

అధిక వర్షాల తాకిడీకి గత ఖరీఫ్‌లో వరి రైతు కుదేలైన విషయం తెలిసిందే. ఈ ప్రభావం ఈ ఏడాది పాడి రైతులపై అధికంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పంట నూర్పిడిని రైతులు చేపడుతున్నారు. వరి గడ్డి సేకరణకు పాడి రైతులు సిద్ధమవుతున్నారు. గత ఏడాదిలో వరి పంట అధికంగా నేల కొరగడం, వర్షానికి దెబ్బతింది. నేల కొరి గిన వరి పంటను చైన్‌లతో నడిచే వరికోత మిషన్ల ద్వారా పంట నూర్పిడి చేపట్టారు. ఈ మిషన్ల ద్వారా నూర్పిడి చేయడంతో వరి గడ్డి ఏమాత్రం పనికి రాకుండా పోయింది. టైర్ల మిషన్ల ద్వారా, కూలీల ద్వారా నూర్పిడి చేసిన వరి పంట నుండి మాత్రమే వరిగడ్డి లభ్యమైంది. గత ఖరీఫ్‌లో మం డల పరిధిలో 18 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేపట్టారు. 2వేల ఎకరాల వరకు తుఫాన్ తాకిడికి నేలకొరిగింది. ప్రస్తుతం మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, దువ్వూరు, బి.మఠం మండలాల్లో 50 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేపట్టారు. పెన్నా, కుందూ తీర ప్రాంతంలో ముందస్తుగా సాగు చేసిన 6వేల ఎకరాలలో వరి పంటను నూర్పిడి చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో వరిగడ్డి లభిస్తుండడంతో పాడి రైతులు దాని సేకరణ చేపడుతున్నారు. ఎకరా వరిగడ్డి రూ.5 వేల నుంచి రూ.6వేల వరకు ధర చెబుతున్నారు. మిషన్ల ద్వారా నూర్పిడి చేసిన వరిగడ్డిని ట్రాక్టర్‌తో కట్టలు కట్టిస్తున్నారు. ఒక కట్ట వరిగడ్డి కట్టడానికి రూ.30 వసూలు చేస్తున్నారు. ఒక్కొక్క కట్ట రూ.120తో అమ్మకాలు చేపడుతున్నారు. ఈ విధానం ద్వారా వరిగడ్డిని సులభంగా కట్టలుగా మార్చి రవాణా సులభతరం అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ వరిగడ్డిని కట్టలు కట్టించేందుకు రవాణాతో కలిపి రూ.9 వేలకు పైగా అవుతున్నదని పాడి రైతులు వాపోతున్నారు. వివిధ మం డలాల నుండి రైతులు చాపాడు ప్రాంతంలో వరిగడ్డిని కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు.

పులివెందులకు నీరిచ్చిన ఘనత చంద్రబాబుదే

- వైసిపి నుంచి టిడిపిలోకి 400 మంది కార్యకర్తలు

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి ప్రభుత్వ పాలనలోనే పులివెందులకు నీళ్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి (వాసు) పేర్కొన్నారు. వేంపల్లెకు చెందిన వైసిపి నేత దేవర్ల చంద్రశేఖర్‌రెడ్డి (దిల్ మాంగే) ఆధ్వర్యంలో బుధవారం వైసిపి నుంచి టిడిపిలోకి 400 మంది కార్యకర్తలు చేరారు. వీరికి ఆర్.శ్రీనివాసరెడ్డి, టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి పసుపు కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా టిడిపి కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలతో రోడ్ షో నిర్వహించారు. రోడ్ షోలో బిటెక్ రవిని గజమాలతో సత్కరించారు. అనంతరం పుల్లయ్య తోటలో నిర్వహించిన బహిరంగ సభలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పులివెందులోని ఒకే కుటుంబం నుంచి ఇద్దరు వ్యక్తులు ముఖ్యమంత్రిగా పని చేసి కూడా సాగు, తాగునీరు ఇవ్వలేదన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. బెంగళూరులో ఉన్న కన్నడ బిడ్డకు టిడిపిలో చేరికలను చూసి దడ పుడుతుందన్నారు. బీటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో పెద్ద ఎత్తున వైసిపి నేతలు, కార్యకర్తలు టిడిపిలో చేరుతున్నారని తెలిపారు. ఇది చూసి ఓర్వలేక సతీష్‌రెడ్డికి మతిభ్రమించిదని పేర్కొన్నారు. టిడిపిలో చేరిన చంద్రశేఖర్‌రెడ్డికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథి రెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హైలెవల్ కెనాల్ ఛైర్మన్ జోగిరెడ్డి, మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, శివ కృష్ణా రెడ్డి, మొండోడు గౌస్ బాబా, వీరభద్ర, మహమ్మద్, డక్కా రమేష్, టిఎన్ ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు యాసిన్, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


చంద్రశేఖర్‌రెడ్డికి టిడిపి కండువా వేసి ఆహ్వానిస్తున్న బీటెక్ రవి, ఆర్.శ్రీనివాసరెడ్డి

అబార్షన్ కేసుల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో నవంబర్ నెలలో నమోదైన అబార్షన్ కేసుల వివరాలపై అధికారుల సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి.మల్లేష్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ వి.సుధా ఆధ్వర్యంలో ఆడిట్ నిర్వహించారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంతోపాటు, అబార్షన్ కేసుల్లో ప్రభుత్వం సూచించిన నిబంధనలు, పద్ధతులు ఖచ్చితంగా అమలయ్యేలా చూడడమే ఈ తనిఖీ ముఖ్య ఉద్దేశమన్నారు. నవంబర్ నెలలో జరిగిన అబార్షన్స్ కేసుల రికార్డులను, రోగులకు అందించిన సేవల నాణ్యతను వారు తనిఖీ చేశారు. కార్యక్రమంలో బద్వేల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం లు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న వైద్యాధికారులు

మోడీ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ : పిసిసి


విలేకరులతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వ పతనానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరును కేంద్ర ప్రభుత్వం తొలగించినందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం పతనానికి దాపురించిందన్నారు. అందుకే విపరీత బుద్ధులు పుట్టాయని విమర్శించారు. ఉపాధి హామీ పథకం వలన ప్రజలు చాలా ఆర్థికంగా ఎదుగుతున్నారని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద పథకం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకమన్నారు. బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ఉపాధి హామీ పథకం నెరవేరుస్తున్నందున ఈ పథకానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అని 2009లో పేరు పెట్టారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి ఉపాధి హామీ పథకం పేరులో మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, పులివెందుల సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లె, చక్రాయపేట, వేముల మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి జిలానీబాషా, జిల్లా జాయింట్ సెక్రెటరీ సాయి కుమార్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, బండారు వెంకటేశు, వేమారాజా, వేమయ్య, బద్రీనాథ్, రాఘవయ్య, బ్రహ్మం, లక్కిరెడ్డి చెన్నకృష్ణారెడ్డి, వినయ్, శివ, కువైట్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

చాపాడు : స్వతంత్ర భారతదేశ ఆవిర్భానికి తన జీవితాన్ని త్యాగం చేసిన జాతిపిత మహాత్మా గాంధీ పేరును గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి రామసుధాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2006లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా జాతిపిత మహాత్మా గాంధీ పేరును గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పెట్టారని ఆయన గుర్తు చేశారు. ఆ మహనీయుడి పేరుతో కోట్లాది గ్రామీణ ప్రజలకు ఉపాధి ద్వారా భరోసా లభించిందన్నారు. అలాంటి చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ వారసత్వాన్ని విస్మరించి, నేటి బిజెపి ప్రభుత్వం గాంధీ పేరును తొలగించడం దేశ ప్రజలకు తీరని అన్యాయమే అన్నారు.

వృద్ధులు ఆలోచనలను పంచుకోవాలి : ఎమ్మెల్సీ



ఎమ్మెల్సీ పిఆర్‌కు స్వాగతం పలుకుతున్న విశ్రాంత ఉద్యోగులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

విశ్రాంత ఉద్యోగస్తులు తమ ఆలోచనలను ప్రతి ఒక్కరితో పంచుకోవాలని ఎమ్మెల్సీ, వైసిపి జమ్మలమడుగు సమన్వయకర్త పి.రామ సుబ్బారెడ్డి, డిఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. జాతీయ విశ్రాంత ఉద్యోగస్తుల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సభాభవనంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ, డిఎస్పీ మాట్లాడుతూ వారి మేధాశక్తి నేటి తరానికి అవసరమన్నారు. చట్టాలు, సమాజం మారుతోందన్నారు. మారుతున్న కాలంతో గత స్మృతులు మరుగున పడిపోకుండా వృద్ధులు వారధులు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఉద్యోగరీత్యా ఎదుర్కొన్న అనుభవాలను పంచుకున్నారు. వారి సమస్యలను ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి వివరించగా, విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై తమవంతుగా శాసనమండలిలో ప్రస్తావి స్తానన్నారు. 38 మంది విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. పొన్నారి దస్తగిరి తమ్ముడు మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు మండలంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.5,000, రూ.3,000, రూ.2,000 నగదు బహుమతిని అందజేశారు. విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : జాతీయ పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక తాలూకా ఆఫీస్ ప్రాంగణంలో ప్రొద్దుటూరు పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. 75ఏళ్లు పూర్తి చేసుకున్న పెన్షనర్స్ దంపతులను విశిష్ట అతిథులచే ఘనంగా సత్కరించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బచ్చల పుల్లయ్య, ట్రాఫిస్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, అసోషియేషన్ ప్రెసిడెంట్ దస్తగిరిరెడ్డి, సెక్రెటరీ వెంకటయ్య యాదవ్, ప్రొద్దుటూరు ఎన్జీవో ప్రెసిడెంట్ రామసుబ్బయ్య, తహశీల్దార్ గంగయ్య, ప్రొద్దుటూరు సబ్‌ట్రెజరీ అధికారి తిరుపతి స్వామి, జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ పాలగిరి బసివిరెడ్డి, ప్రొద్దుటూరు ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ భూమిరెడ్డి వెంకట సుబ్బయ్య, రిటైర్డ్ ప్రిన్సిపల్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ వంకదార కళావతి, ప్రొద్దుటూరు ఎన్జీవో సెక్రెటరి ఇ.ప్రమీల, ట్రెజరర్ సి.సదాశివయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి వాలీబాల్, ఖోఖో పోటీలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

భారత ప్రభుత్వం, క్రీడా మంత్రిత్వ శాఖ, మైభారత్, సురేంద్ర చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జమ్మలమడుగు నియోజకవర్గ స్థాయి వాలీబాల్, ఖోఖో పోటీలు శుక్రవారం ఉదయం 9గంటల నుంచి పిఆర్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆ ట్రస్ట్ సీఈఓ చింత కుంట సురేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్ పోటీల్లో 16-28ఏళ్లలోపు యువకులు, ఖోఖోలో 16-26 ఏళ్లలోపు యువతులు పాల్గొనవచ్చని తెలిపారు. గెలుపొందిన జట్టుకు నగదుతోపాటు ట్రోఫీ, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన జట్లను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామనాన్రు. పాల్గొనదలిచిన జట్టు ట్రస్ట్ సీఈవో సురేంద్ర 88868 98483 నెంబర్‌ను సంప్రదించి వారి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.

22న పోస్టల్ ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ఈ నెల 22న 11గంటలకు కర్నూలు పోస్టాఫీస్‌లో నిర్వహించనున్న ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు పోస్టల్ సుపరింటెండెంట్ జి.కిరణ్ ఒక ప్రకటనలో కోరారు. ప్రజల సౌకర్యం కోసం పోస్టల్ డిపార్ట్మెంట్‌లో ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి కర్నూలు పోస్టుమాస్టర్ జనరల్ కర్నూల్ ఏర్పాటు చేశారన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని చిలంకూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులు సాయిచరిత రెడ్డి, గణేష్‌రెడ్డి సూచించారు. స్థానిక వైద్య సిబ్బంది, ప్రజలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంగా ఉన్నా, ఆరోగ్యంగా ఉన్నా, పుట్టిన పిల్లలకైన తప్పక పోలియో చుక్కలు వేయాలన్నారు. ఇది సాధారణ టీకాలకు అదనపు రక్షణ అని, పల్స్ పోలియో రోజుల్లో ప్రతి ఇంట్లో పిల్లలకు చుక్కలు వేయించడం ద్వారా పోలియో వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. ఈనెల 21,22,23తేదీల్లో పోలియో చుక్కల కార్యక్రమం జరుగుతుందన్నారు. చిలమకూరు పిఎస్ పరిధిలో 2,356 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. సమావేశంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నాగమణిరెడ్డి, హెల్త్ సూపర్వైజర్ రవిశంకర్ రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.


బర్త్ డే కేక్ కట్ చేస్తున్న పవిత్ర

అనాథ శరణాలయ పిల్లలకు అల్పాహారం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాచనేని పవిత్ర 9వ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం స్థానిక విద్యార్థి అనాథ శరణాలయంలో పిల్లలకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా పవిత్ర తల్లిదండ్రులు రాచనేని శ్రీనివాసులు, కుళ్లాయమ్మ మాట్లాడుతూ పవిత్ర వయసు చిన్నదే అయినా పదిమంది పేదలకు సహకరించాలనే మనస్తత్వం కలదని తెలిపారు. పవిత్ర పేదల గురించే యోచిస్తూ ఉంటుందన్నారు. పాప కోరిక మేరకు ఈ అల్పాహారం ఏర్పాటు చేశామన్నారు. తమ కుమారుడు వెంకట ఆదిత్య, కూతరు పవిత్ర మున్సిపల్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. ఇరువురు చదువులో మంచి దిట్ట అని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన వేమన పద్య పోటీల్లో ఆదిత్య మొదటి స్థానంలో నిలిచాడని తెలిపారు. పిల్లలను చిన్నప్పటి నుంచే మహనీయుల జీవన స్థితిగతుల గురించి చెబుతూ ఉండాలని, అప్పుడే వారి భవిష్యత్తు చక్కగా ఉంటుందన్నారు. అనంతరం పిల్లలతో కలిసి పుట్టినరోజు కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు అమ్మ సరస్వతి, శరణాలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

పురుగు మందు మోతాదు మేరకే వాడాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

పురుగు మందులను మోతాదు మేరకు వాడాలని మైదుకూరు ఎఒ ఇ.బాలగంగాధర్‌రెడ్డి సూచించారు. మైదుకూరు మండలం అన్నలూరు, సోమయాజుల పల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగుచేసిన మొక్కజొన్న, టమోటా, మినుము పంటలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి గుర్రప్ప, వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు

క్రైం కార్నర్


గాయపడిన వరలక్ష్మిదేవి

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి - వల్లూరు

కడప-తాడిపత్రి జాతీయ రహదారి కొపోలి బస్టాండ్ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల అందించిన సమాచారం మేరకు.. కమలాపురం నుంచి కడపకు వెళుతున్న ద్విచక్ర వాహనం కొప్పోలు బస్టాండ్ వద్ద మహిళ రోడ్డు దాటుతుండగా ఢీకొనగా పుత్త చిన్నయ పల్లెకు చెందిన వరలక్ష్మిదేవి తీవ్రంగా గాయపడింది. ఆమెను 108వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

అసభ్యకరంగా ప్రవర్తించినందుకు జైలుశిక్ష

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఓ అమ్మాయితో ఇద్దరు వ్యక్తులు అసభ్యకరంగా ప్రవర్తించినందుకు కడప కోర్టు జైలుశిక్ష విధించినట్లు కలమల్ల ఎస్ఐ సునీల్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా.. 2023లో బాధిత అమ్మాయి తనతో అసభ్యకరంగా ప్రవర్తించారంటూ కలమల్ల పోలీస్‌స్టేషన్లో అప్పటి ఎస్ఐ సంజీవరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఆయన విచారించి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఆ కేసులో వీరికి బుధవారం కడప జిల్లా కోర్టులో జడ్జి పవన్‌కుమార్ విచారణ జరిపి జరిమానాతో పాటు జైలుశిక్ష విధించారు. ముద్దనూరు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన కుంచపు శ్రీధర్‌కు 21 రోజులు జైలుశిక్ష, రూ.25,000 జరిమానా, గోపాల్ అనే వ్యక్తికి 17 రోజుల జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధించారు.

నలుగురు జూదరులు అరెస్టు

రూ.38 వేలు నగదు స్వాధీనం

ప్రజాశక్తి -ముద్దనూరు

మండలంలోని కాండ్లోపల్లె గ్రామ సమీపంలో గాలేరు-నగరి కాలువ వద్ద బుధవారం పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు సిఐ నగేష్‌బాబు తెలిపారు. జమ్మలమడుగుకు చెందిన జనార్ధన్‌తోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరివద్ద నుంచి రూ.38 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.